సాక్షి
నల్లగొండ
శుక్రవారం । 14 । ఫిబ్రవరి । 2025



పంటలు ఎండుతున్నా..పట్టదా?
కరెంట్ కోతలతో పంట పొలాలు ఎండుతున్నా మంత్రులకు పట్టడం లేదని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. - 8లో



ముగిసిన బ్రహ్మోత్సవాలు
యాదగిరిగుట్ట పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి (పాతగుట్ట) ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. - 8లో



వృద్ధురాలి హత్య
వృద్ధురాలిని హత్య చేసి ఆమె మెడలోని పుస్తెలతాడు చోరీ చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

డిగ్రీ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు ఫీజు గడువు పెంపు

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉత్తీర్ణత సాధించని డిగ్రీ విద్యార్థులకు పరీక్ష ఫీజు గడువును ఈ నెల 28వ తేదీ వరకు పొడిగించినట్లు ఎంజీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2011- 2012 నుంచి బీఏ, బీకాం, బీఎస్సీ అభ్యసించి ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు ఇదే చివరి అవకాశమని దీనిని వినియోగించుకోవాలని కోరారు. డిగ్రీ సీబీఎస్ విధానంలో 2016-17 విద్యా సంవత్సరం నుంచి 2019-2020 విద్యా సంవత్సరం వరకు విద్యనభ్యసించి ఉత్తీర్ణత సాధించని వారు కూడా ఈ నెల 28వ తేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు.

కీటక జనిత వ్యాధుల నివారణకు కృషిచేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్

నల్లగొండ టౌన్: సీజన్‌లో వ్యాప్తి చెందే కీటక జనిత వ్యాధులను నివారించడానికి సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ వర్కర్లు సమష్టిగా కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జాతీయ కీటక జనిత వ్యాధులపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. దోమలు, ఈగలు, ఇతర కీటకాల వ్యాప్తిని అరికట్టాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి ఆరోగ్య పరిరక్షణకు పాటుపడాలన్నారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ మలేరియా అధికారి డాక్టర్ కళ్యాణచక్రవర్తి, సీనియర్ ఎంటామాలజిస్టు గంగప్ప, డీపీఓ జి.విష్ణు, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ వర్కర్లు పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలి



మాడ్గులపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

వేములపల్లి(మాడ్గులపల్లి): వేసవిలో నర్సరీల్లో నాటిన మొక్కలు ఎండిపోకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మాడ్గులపల్లి మండల కేంద్రంలోని నర్సరీని ఆయన పరిశీలించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా నెట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. మొక్కలకు ఎప్పటికప్పుడు నీటిని అందించాలన్నారు. మొక్కలు ఎండిపోతే వాటిని తొలగించి తిరిగి కొత్త మొక్కలు నాటాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఖాసీం, సిబ్బంది తదితరులున్నారు.

భరోసా కల్పించాలని హైకోర్టు ఆదేశం

చివ్వెంల(సూర్యాపేట) : పరువు హత్యకు గురైన జిల్లా కేంద్రానికి చెందిన మాలబంటి అలియాస్ కృష్ణ కుటుంబాన్ని మూడు వారాల్లో కలెక్టర్, ఎస్పీ కలిసి భరోసా కల్పించాలని గురువారం హైకోర్టు ఆదేశించినట్లు హైకోర్టు న్యాయవాది ఎద్దు దివాకర్ తెలిపారు. తమకు న్యాయం జరగడం లేదంటూ మాలబంటి కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. హత్యకు గురై 20 రోజులు అవుతున్నా బంటి కుటుంబాన్ని ఎస్సీ, ఎస్సీ అట్రాసిటి చట్టం ప్రకారం, కలెక్టర్, ఎస్పీ పరామర్శించి భరోసా కల్పించలేదన్నారు.




సాక్షి సర్వేలో పాల్గొన్న ఎంజీ యూనివర్సిటీ విద్యార్థులు

పెళ్లి నిర్ణయం పెద్దలదే..

- అరెంజ్‌డ్ మ్యారేజ్‌కే యువత మొగ్గు
- ప్రేమ పెళ్లి చేసుకుంటామని కొందరి అభిప్రాయం
- వాలెంటైన్స్ డే సందర్భంగా 'సాక్షి' సర్వేలో మనోగతం వెల్లడించిన యువత

ఉమ్మడి జిల్లాలో 100 మంది యువతులు, 100 మంది యువకులను పలకరించగా.. వారు వెల్లడించిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.



నల్లగొండ టూటౌన్, సూర్యాపేట టౌన్, భువనగిరి పెద్దలు కుదిర్చిన వివాహాన్నే చేసుకుంటామని చెబుతోంది మెజార్టీ యువత. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారు చూసిన సంబంధాన్నే చేసుకుంటే కలకాలం సుఖ సంతోషాలతో జీవించవచ్చని అంటోంది. మరికొందరు మాత్రం ప్రేమ వివాహానికే మొగ్గుచూపుతున్నారు. ప్రేమ పెళ్లితోనే ఇద్దరి మధ్య ప్రేమానురాగాలు పెంపొందుతాయని అంటున్నారు. ఇక.. ప్రేమించుకుని ఇద్దరూ ఉద్యోగాలు సాధించిన తరువాత పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుంటే ఎలాంటి సమస్యలు రావని మరికొంత మంది అభిప్రాయ పడుతున్నారు. శుక్రవారం ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వివాహాలపై 'సాక్షి' యువత అభిప్రాయాలను తీసుకుంది.

పెద్దలు కుదిర్చిన పెళ్లికే అంగీకారం



ప్రేమ, ఆకర్షణ.. రెండు వేరు. చిన్న వయసులో ప్రేమలో పడి పెళ్లి చేసుకుంటే భవిష్యత్‌లో ఇబ్బందులు వస్తాయి. చదువు పూర్తయిన తరువాత పెద్దలు కుదర్చిన పెళ్లి చేసుకుంటే మనం ఎక్కడైనా తలెత్తుకొని తిరగవచ్చు.
– రాధాకృష్ణ, విద్యార్థి

తల్లిదండ్రులను గౌరవించాలి



తల్లిదండ్రులు మనమీద ఎన్నో ఆశలు పెట్టుకొని కళాశాలలకు పంపుతున్నారు. వాళ్ల ఆశలను నీరుగార్చుకుండా ఏకాగ్రతతో చదవుకొని ఉద్యోగం సాధించాలనే తపన పెట్టుకోవాలి. తల్లిదండ్రుల కుదుర్చిన పెళ్లి చేసుకోవాలి.
–ప్రశాంతి, విద్యార్థిని

ప్రేమ వివాహాలతో అంతరాలు తొలగుతాయి



ఇద్దరం అట్టడుగు వర్గాల పక్షాన పోరాడే సంస్థల్లో పనిచేశాం. నాది కొడంగల్ కాగా, నా భర్త వెంకటేశ్వర్లు పురం న్యాయవాది. ఆయనది నల్లగొండ పట్టణం బీటీఎస్. నేను మొదట అరుణోదయ సంస్థలో పని చేయగా, నా భర్త పీడీఎస్‌యూలో పని చేసేవారు. మా ఇద్దరి భావాలు, భావజాలం ఒక్కటే కావడంతో ఒకరినొకరం ఇష్ట పడ్డాం. ప్రేమించుకున్న నాలుగేళ్ల తరువాత పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నాం. 2018లో దగ్గరి బంధువులు, సన్నిహితుల సమక్షంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్టేజీ మీద దండలు మార్చుకొని ఒక్కటయ్యాం. కులం, మతం లాంటి అంతరాలు పోవాలంటే ప్రేమ పెళ్లిళ్లు చేసుకోవాల్సిన అవసరం ఉంది. పెద్దలు అభ్యంతరాలు చెప్పినా వారిని ఒప్పించి పెళ్లి చేసుకోవాలి. – అనితకుమారి, లెక్చరర్, ఎంజీ యూనివర్సిటీ

Valentine's

ఎమ్మెల్సీ బరిలో 19 మంది

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
- ఇక జోరుగా సాగనున్న ప్రచారం
- టీచర్లను ఆకట్టుకునే పనిలో అభ్యర్థులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో 19 అభ్యర్థులు నిలిచారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. 19 మంది మధ్య పోటీ కొనసాగనుంది. బరిలోఉండే వారు తేలడంతో నేటి నుంచి ప్రచారం ఊపందుకోనుంది.

మొత్తం 23 నామినేషన్లు దాఖలు
ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 3వ తేదీన నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై 10 తేదీన ముగిసింది. మొత్తం 23 మంది అభ్యర్థులు 50 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. 11వ తేదీన జరిగిన నామినేషన్ల పరిశీలనలో ఒక అభ్యర్థి ఒక నామినేషన్ తిరస్కరణకు గురైంది. 22 మంది నామినేషన్లను ఆమోదించారు. 13వ తేదీ నామినేషన్ల ఉపసంహరణకు ఆఖరు గడువు కావడంతో ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. వారిలో హైదరాబాద్ కొత్తపేటకు చెందిన కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, సూర్యాపేట జిల్లా మునగాల మండలానికి చెందిన బండారు నాగరాజు, కోదాడ మండలం లక్ష్మీపురానికి చెందిన జి. కోటిరెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చిత్రంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు కలెక్టర్

మిగిలింది ప్రచారమే..
ఎన్నికల ప్రక్రియలో ప్రధానమైన నామినేషన్లు, ఉపసంహరణలు పూర్తికావడంతో బరిలో ఉండే అభ్యర్థుల లెక్క తేలిపోయింది. అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. నేటి నుంచి ప్రచారం ముమ్మరం కానుంది. పోలింగ్ ఈ నెల 27వ తేదీన జరుగనుంది. పోలింగ్‌కు రెండు రోజుల ముందే ప్రచారం బంద్ చేయాల్సి ఉంటుంది. ఈ నెల 25వ తేదీ సాయంత్రం వరకే ప్రచారం చేసుకునే అవకాశం ఉంది. ప్రధాన సంఘాల అభ్యర్థులు కొందరు ఇప్పటికే రెండు మూడు దఫాలుగా జిల్లాలను చుట్టేశారు. సాధారణ ఎన్నికల తరహాలో ఎక్కడికక్కడ కళాశాలలు, సంఘాల వారీగా దావత్‌లను ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు. తమ గెలిపిస్తే సమస్యలు పరిష్కరిస్తామంటూ హామీలు ఇస్తున్నారు.

పోటీలో ఉన్న అభ్యర్థులు..
అలుగుబెల్లి నర్సిరెడ్డి, పులి సరోత్తంరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి పింగిళి, పూల రవీందర్, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్.సుందర్‌రాజు, డాక్టర్ కొలిపాక వెంకటస్వామి, లింగిడి వెంకటేశ్వర్లు, అర్వ స్వాతి, కంటె సాయన్న, పన్నాల గోపాల్‌రెడ్డి, ఏలె చంద్రమోహన్, చాలిక చంద్రశేఖర్, జంకిటి కైలాసం, జి.శంకర్, తలకోల పురుషోత్తం రెడ్డి, తాటికొండ వెంకటరాజయ్య, దామెర బాబురావు, బంక రాజు.

మా భావాలు కలిశాయి

- మా కుటుంబాలు ఒప్పుకున్నాయి
- మేము పనిచేసే ఉద్యమ సంస్థే మా పెళ్లి చేసింది
- ప్రేమించి.. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుంటే ఏ సమస్యా ఉండదు
- జీవితంపై స్పష్టమైన అవగాహన తప్పనిసరి

'సాక్షి'తో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, పుష్ప దంపతులు



ఆదర్శ ప్రేమ వివాహం చేసుకున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, పుష్ప దంపతులు

నకిరేకల్: 'మేము విప్లవ, ప్రగతిశీల ఉద్యమంలో పనిచేశాం. మా ఇద్దరి జీవిత లక్ష్యం ఒక్కటే కావడంతో కలిసి బతకాలనుకున్నాం. మా కులాలు వేరైనా ఇరు కుటుంబాలు కమ్యూనిస్టు భావజాలం కలిగినవి కావడంతో మా పెద్దలు పెళ్లికి అంగీకరించారు. ఆనాడు మేము పనిచేస్తున్న ఉద్యమ సంస్థే మాపెళ్లి జరిపించింది. ప్రేమిస్తే.. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుంటే ఎలాంటి సమస్యా ఉండదు' అని చెబుతున్నారు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, పుష్ప దంపతులు. శుక్రవారం ప్రేమికుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' వారిని పలకరించగా.. ప్రేమ, పెళ్లిపై వారి మనోగతాన్ని వెల్లడించారు.

ఒక విజన్ ఉండాలి
పెళ్లి అనేది.. ఇద్దరి మనస్సులు, వ్యక్తిత్వాలు, రెండు జీవితాలు.. భవిష్యత్‌కు సంబంధించిన నిర్ణయం. ప్రేమ అంటే మానవీయ విలువలతో పాటు కుల మతాలకతీతంగా రెండు మనస్సులు కలిసి కడదాకా బాధ్యతలను పంచుకుని కలిసి సాగడం. ప్రేమ పెళ్లిళ్లు, కులాంతర వివాహలు చేసుకునే వారు భవిష్యత్ సంబంధించి ఒక విజన్ ఏర్పరుచుకోవాలి. జీవితంపై ఒక స్పష్టత ఉంటే.. ఎలాంటి సమస్యా ఉండదు. తాత్కాలిక ఎమోషన్‌తో నిర్ణయాలు తీసుకుంటే.. అనేక చిక్కులు వచ్చే ప్రమాదం ఉంటుంది. ప్రేమ, పెళ్లికి ముందు.. ఆ వ్యక్తి యొక్క వ్యక్తిత్వం, గుణగణాలు, అలవాట్లు, అభిరుచులు, ఆలోచన ధోరణి తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని స్పష్టమైన అవగాహనతో నిర్ణయం తీసుకుంటే జీవనం సాఫీగా సాగుతుంది.

జీవితంపై స్పష్టత అవసరం
ప్రేమించడం, ప్రేమించబడడం, ప్రేమించిన తర్వాత పెళ్లి చేసుకోడడం తప్పు కాదు. సమాజంలో ఉండే కులాలు, కుటుంబాలు, భార్యభర్తలు మధ్య ఉండే వైరుధ్యాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలి. కులాంతర వివాహమైనా.. కులంలో పెళ్లి అయినా ఇరువైపులా తల్లిదండ్రులను ఒప్పించి పెద్దల సహకారంతో చేసుకునే పెళ్లిళ్లకు సహకారం, నిబద్ధత ఉంటాయి. ఒకవేళ తల్లిదండ్రులు ఒప్పుకోకపోయినా ఇరువురు.. ఒక అవగాహనతో ప్రేమ, జీవితంపై స్పష్టతతో పెళ్లి చేసుకున్నా.. హ్యాపీగా ఉండొచ్చు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్, వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి అన్నారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం గురువారం కలెక్టరేట్‌లో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు, వారి ఏజెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పోటీలో ఉన్న అభ్యర్థులు పాఠశాల సమయంలో ప్రచారం చేయడం నిషిద్ధమని తెలిపారు. వాహనాలు, ర్యాలీలకు సంబంధించిన అనుమతులు ఆయా జిల్లాల్లో తీసుకోవచ్చని తెలిపారు. కలెక్టర్ పోలింగ్ ఏజెంట్ల నియామకం, కౌంటింగ్ ఏజెంట్ల వివరాలు సమర్పించాలని, గుర్తింపు కార్డులకు ఫొటోలను ఇవ్వాలన్నారు. ఈ నెల 10న ప్రచురించిన ఓటరూ జాబితా ప్రకారం ఓటర్లు 25,797 మంది ఉన్నారన్నారు. నల్లగొండ సమీపంలోని ఆర్జాల బావి వద్ద ఉన్న గోదాంలో స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎస్పీ శరత్ చంద్రపవార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు లౌడ్ స్పీకర్లకు అనుమతి ఉంటుందని, కౌంటింగ్ సందర్భంగా మూడంచెల భద్రత ఉంటుందని, సీసీటీవీ కెమెరాల నిఘాలో భద్రతను పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ప్రచురించే కరపత్రాలు, నిబంధనలు, మీడియా సర్టిఫికేషన్ కమిటీ ద్వారా తీసుకునే అనుమతులను అదనపు కలెక్టర్ శ్రీనివాస్ వివరించారు.

నారసింహుడికి సంప్రదాయ పూజలు



నిత్యకల్యాణం జరిపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం నిత్యపూజలు సంప్రదాయ రీతిలో కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులను పంచామృతాలతో అభిషేకించారు. ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, అష్టోత్తరం, ప్రాకార మండపాల్లో శ్రీ సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తుల జోడు సేవలను ఆలయ మాడవీధిలో ఊరేగించారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు

దేవరకొండ: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిని గురువారం రాత్రి ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని అన్ని వార్డులను కలియతిరిగి రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రమణారెడ్డి, ఆస్పత్రి సూపరింటిండెంట్ రవి ప్రకాశ్, వైద్య సిబ్బంది తదితరులున్నారు.

వైద్యసేవలపై కలెక్టర్ ఆరా
డిండి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ చేశారు. పీహెచ్‌సీకి 20 నిమిషాలు ఆలస్యంగా వచ్చిన కాంట్రాక్ట్ ఉద్యోగి వాచ్‌మెన్‌గా పని చేస్తున్న సంతోష్‌ను సర్వీస్ నుండి తొలగించాలని, మెడికల్ ఆఫీసర్‌తోపాటు సిబ్బందికి మెమోలు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు.



దేవరకొండ ఆస్పత్రిలో రోగుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కొండమల్లేపల్లి సీఐ ధనుంజయగౌడ్ ఐజీ ఆఫీస్‌కు అటాచ్?

- కానిస్టేబుల్ ఖలీల్ సస్పెండ్
- ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ : ఇటీవల ఒక డిజిటల్ పత్రిక వ్యవహారంలో కొండమల్లేపల్లి సీఐ ధనుంజయగౌడ్‌ను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేసినట్లు తెలిసింది. ఆయనతో పాటు కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ ఖలీల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. క్రైం మిర్రర్ డిజిటల్ పత్రిక ముసుగులో కొంత మంది.. అధికారులు, వ్యాపారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం రావడంతో విచారణ జరిపి కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. కాగా ఆ పత్రికా విలేకరులకు రహస్యంగా పోలీస్ శాఖ అధికారులు సమాచారం అందిస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఎస్పీ శరత్‌చంద్ర పవార్ విచారణ చేపట్టి కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసి సీఐని అటాచ్ చేసినట్లు సమాచారం.

పశుగణన 40 శాతం పూర్తి

- 163 మంది ఎన్యుమరేటర్ల నియామకం
- ఒక్కో ఎన్యుమరేటర్ ప్రతి రోజు 1500 నుంచి 2వేల ఇళ్లలో సర్వే
- ఇప్పటివరకు లక్షా 75 వేల ఇళ్లలో పశుగణన పూర్తి

నల్లగొండ అగ్రికల్చర్: జిల్లాలో అఖిల భారత 21వ పశుగణనను జిల్లా పశువైద్య సంవర్ధక శాఖ గత నెల 20వ తేదీ నుంచి నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా పశువులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు, కుక్కలు, పందులు, గుర్రాలు, కుందేళ్ల తదితర వాటి లెక్కలు తేల్చే పనిలో పశువైద్య సంవర్ధక శాఖ సిబ్బంది నిమగ్నమయ్యారు. జిల్లా వ్యాప్తంగా 163 మంది ఎన్యుమరేటర్లను నియమించారు. ఒక్కో ఎన్యుమరేటర్ ప్రతి రోజు 1500 నుంచి 2వేల ఇళ్లలో సర్వే చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 707 పట్టణాల్లోని వార్డులతో పాటు గ్రామాల్లో పశుగణన నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 95 గ్రామాల్లో సర్వే పూర్తిచేశారు. ప్రతి రోజు సర్వే చేసిన గణాంకాలను మండల స్థాయి అధికారులకు ఎన్యుమరేటర్‌లు పంపించిన వెంటనే పశువైద్యాధికారి పరిశీలించి జిల్లా స్థాయి నోడల్ అధికారికి పంపిస్తారు. ఈ గణాంకాలను రాష్ట్ర స్థాయి అధికారికి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి యాప్‌లోకి ప్రతి రోజు అప్‌లోడ్ చేస్తున్నారు.

ఈ నెలాఖరు వరకు కొనసాగనున్న పశుగణన
2011 అఖిల భారత పశుగణన గణాంకాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 4లక్షల 50 వేల కుటుంబాలు ఉండగా.. ఇప్పటివరకు లక్షా 75 వేల కుటుంబాల్లో ఎన్యుమరేటర్లు సర్వే నిర్వహించారు. అంటే 40శాతం కుటుంబాల్లో సర్వే పూర్తి చేసినట్లు తెలిసింది. పశుగణన వల్ల పశు సంపద పరిరక్షణతో పాటు వాటికి సరైన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించడానికి ఈ గణాంకాలు ఉపయోగపడనున్నాయి. జిల్లాలో ఈ నెలాఖరు వరకు పశుగణన సర్వే నిర్వహించే అవకాశం ఉంది. ఒక వేళ సర్వే పూర్తి కాకపోతే గడువును కూడా పెంచే అవకాశం ఉంది.

ఎన్యుమరేటర్లకు సహకరించాలి
జిల్లాలో కొనసాగిస్తున్న పశుగణనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్లకు తమ ఇంటిలో ఉన్న పశుసంపదతో పాటు కోళ్ల ఇతర పెంపుడు జంతువులు వివరాలు తెలియజేయాలి. పశుగణన లెక్కల ద్వారానే వాటి సంక్షేమానికి నిధులు వచ్చే అవకాశం ఉంటుంది. – డాక్టర్ ఖాద్రీ, జిల్లా పశువైద్య సంవర్ధక శాఖాధికారి

డబుల్‌బెడ్‌రూం ఇళ్లలోకి ప్రవేశానికి లబ్ధిదారుల యత్నం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్



డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద లబ్ధిదారులు

- లాటరీ ద్వారా ఎంపిక చేసి ప్రొసీడింగ్స్ ఇవ్వకపోవడంపై ఆగ్రహం
- స్వయంగా గృహప్రవేశం చేసిన లబ్ధిదారులు

నల్లగొండ టౌన్ : నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లలోకి గురువారం సుమారు 200 కుటుంబాలు గృహప్రవేశానికి యత్నించాయి. గత ప్రభుత్వం లాటరీ ద్వారా ఎంపిక చేసినా ఇప్పటి వరకు ప్రొసీడింగ్స్ ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో సామగ్రి సర్దుకుని డబుల్‌బెడ్‌రూం ఇళ్లలోకి ప్రవేశించారు. విషయం తెలుసుకున్న నల్లగొండ తహసీల్దార్ శ్రీనివాస్ పోలీసులతో కలిసి అక్కడికి వచ్చి లబ్ధిదారులతో మాట్లాడారు. మార్చి 8వ తేదీ వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రభుత్వం ఎలాంటి సంక్షేమ పథకాలు చేపట్టలేకపోతోందని అన్నారు. రెండు సంవత్సరాల క్రితమే లాటరీ ద్వారా ఎంపిక చేసినందున ఎన్నికల కోడ్ అయిపోయిన వెంటనే ప్రొసీడింగ్స్ ఇచ్చి మౌలిక సదుపాయాలు కల్పించి స్వాధీనం చేస్తామని లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల పోరాట సాధన కమిటీ కన్వీనర్ అవుట రవీందర్ మాట్లాడుతూ తహసీల్దార్ శ్రీనివాస్ ఇచ్చిన హామీ మేరకు మార్చి 8వ తేదీ నాటికి ప్రొసీడింగ్స్ ఇవ్వకపోతే మార్చి 10న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎండీ సలీం, దండెంపల్లి సత్తయ్య, మహేష్, జహంగీర్, ఇలియాస్ నగీన, లక్ష్మి, శిల్ప, ప్రభాకర్, రాణమ్మ, పూల నాగయ్య, పావని తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు

భద్రాచలంఅర్బన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం మీదుగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఖమ్మం ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఎన్ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసి భద్రాచలంలోని ఆర్టీఏ కార్యాలయం వద్ద తనిఖీలు చేస్తుండగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారని చెప్పారు. వీరిని అదుపులోకి తీసుకోగా రూ.3లక్షల విలువైన 2.080 కేజీల గంజాయి లభించిందని, నిందితులు నల్లగొండకు చెందిన ముంత నవీన్, నగరికంటి సుభాష్‌గా తేలిందని వెల్లడించారు. వీరిద్దరు ఒడిశా నుంచి నల్లగొండకు గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. నిందితులు, గంజాయి, ద్విచక్ర వాహనాన్ని భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్ అధికారులకు అప్పగించామని పేర్కొన్నారు. తనిఖీల్లో సిబ్బంది బాలు, సుధీర్, హరీష్, వెంకట్, హనుమంతరావు, ఉపేందర్ పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు అపహరణ

పెన్‌పహాడ్: వృద్ధురాలి మెడలోని పుస్తెల తాడును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్ గ్రామంలో గురువారం జరిగింది. ఎస్ఐ గోపికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. దోసపహాడ్ గ్రామానికి చెందిన కీత పిచ్చమ్మ తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్తుండగా.. సాగర్ ఎడమ కాల్వ కట్టపై బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమెను మాటల్లో పెట్టి మెడలోని పుస్తెలతాడు లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పని ప్రదేశంలో ఉపాధి హామీ కూలీ మృతి


లింగమ్మ (ఫైల్)

రామన్నపేట: పని ప్రదేశంలో గుండెపోటుతో ఉపాధి హామీ కూలీ మృతిచెందింది. ఈ ఘటన రామన్నపేట మండల కేంద్రంలో గురువారం జరిగింది. రామన్నపేట మండల కేంద్రానికి చెందిన శ్యామల లింగమ్మ(55) గురువారం అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలో ఉపాధి హామీ పథకంలో కింద పనిచేసేందుకు వెళ్లింది. మధ్యాహ్నం సమయంలో ఆమెకు గుండెపోటు రావడంతో ఒక్కసారిగా పని ప్రదేశంలో కిందపడిపోయింది. సహచర కూలీలు గమనించి స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్‌కు విషయం తెలిపారు. 108 వాహనంలో రామన్నపేట ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

128 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నల్లగొండ: అక్రమంగా నిల్వ ఉంచిన 128 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నల్లగొండ టూటౌన్ ఎస్ఐ నాగరాజు గురువారం పేర్కొన్నారు. నల్లగొండలోని పానగల్ వడ్డెరవాడకు చెందిన కర్ర రమేష్ చుట్టుపక్కల గ్రామాల్లో రేషన్ బియ్యం కొనుగోలు చేసి తన ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేసి రమేష్ ఇంట్లో 11 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేశారు. అదేవిధంగా శ్రీరాంనగర్‌లోని డాన్ స్కూల్ సమీపంలో సాయి ఆంజనేయ రైస్ మిల్లులో నిల్వ ఉంచిన 117 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విదేశీ, స్వదేశీ సంప్రదాయంలో పెళ్లి..

ఖండాంతరాలు దాటిన ప్రేమ

- ప్రేమించుకున్నారు.. పెళ్లితో ఒక్కటయ్యారు
- ప్రేమకు ఎల్లలు లేవని నిరూపించారు
- నేడు ప్రేమికుల దినోత్సవం

ఔను వాళ్లు ఇష్టపడ్డారు..ప్రేమకు ఖండాంతరాలు లేవని నిరూపించారు. మూడు ముళ్ల బంధంతో భార్యాభర్తలుగా ఒక్కటయ్యారు. విదేశాల్లో చదువు, ఉద్యోగాల నిమిత్తం వెళ్లిన పలువురు అక్కడి వ్యక్తులను ప్రేమించి వివాహం చేసుకున్నారు. ప్రేమకు ఎల్లలు లేవని నిరూపించారు. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వీరిపై ప్రత్యేక కథనం.


వివాహంతో ఒక్కటైన ప్రేమ జంట

మోత్కూరు: ఖండాంతరాలు దాటిన ప్రేమ మూడుముళ్ల బంధంతో ఒక్కటైంది. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం దాచారం గ్రామానికి చెందిన జినుకల లలిత, ధర్మయ్య దంపతుల ప్రథమ కుమారుడు సందీప్‌కుమార్‌తో అమెరికాకు చెందిన మరియ డిలారోసా ఆర్మాండోహెర్నాండెజ్ దంపతుల చిన్న కూతురు ఎలేనా (అవని)తో ఏడాది క్రితం అమెరికాలో వివాహం జరిగింది. సందీప్‌కుమార్ పదేళ్ల క్రితం అమెరికాకు వెళ్లి మాస్టర్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశాడు. అనంతరం టెక్సాస్ రాష్ట్రంలో ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. ఎంబీఏ పూర్తి చేసిన ఎలేనా అదే కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తుంది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇరువురి కుటుంబాల తల్లిదండ్రులు అంగీకరించడంతో ఏడాది క్రితం అమెరికా సంప్రదాయం ప్రకారం అక్కడ వీరు ఇరువురు పెళ్లి చేసుకొని దంపతులయ్యారు. సందీప్‌కుమార్ తల్లిదండ్రుల కోరిక మేరకు ఈ నెల 7న ఘట్కేసర్‌లోని రాక్ఎన్‌క్లేవ్ ఫంక్షన్ హాల్‌లో హిందూ సంప్రదాయం ప్రకారం సందీప్‌కుమార్, ఎలేనా మరోసారి పెళ్లి చేసుకుని కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల ఆశీర్వాదం పొందారు.


కుటుంబ సభ్యులతో కందిమళ్ల రాజీవ్‌రెడ్డి-లారెన్ ఫిషర్


ఇండోనేషియా యువతిని ప్రేమ పెళ్లి చేసుకున్న సీమ నాగరాజు

ఇక్కడబ్బాయిలు.. విదేశీ అమ్మాయిలు

చిట్యాల: చిట్యాల మండలానికి చెందిన ఇద్దరు అబ్బాయిలు విదేశీ అమ్మాయిలను పెళ్లి చేసుకుని తమ ప్రేమకు ఎల్లలు లేవని నిరూపించారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామానికి చెందిన కందిమళ్ల మహేందర్‌రెడ్డి-ప్రేమలత దంపతుల కుమారుడు రాజీవ్‌రెడ్డి.. యూకేలోని మాంచెస్టర్‌కు చెందిన కే.ఫిషర్-డేవ్ ఫిషర్ దంపతుల కూతురు లారెన్ ఫిషర్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. రాజీవ్‌రెడ్డి యూకేలోని మాంచెస్టర్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సును చదువుకునేందుకు వెళ్లి అక్కడే ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో అక్కడే పోలీస్‌శాఖలో (సైకాలజీ విభాగం) పనిచేస్తున్న లారెన్ ఫిషర్‌తో పరిచయం ఏర్పడి ప్రేమ మొదలయ్యింది. దీంతో వారిద్దరు వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇరు కుటుంబాల పెద్దలను ఒప్పించి ఇటీవల హైదరాబాద్‌లో హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకుని ఒక్కటయ్యారు. అలాగే గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన సీమ సాలయ్య-యాదమ్మల కుమారుడు నాగరాజు హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అదే సంస్థలో ఇండోనేషియాలో పనిచేస్తున్న ఆ దేశానికి చెందిన యువతి రిజ్కినస్ దానఫిత్రి పనిచేస్తుంది. వీరికి మొదట్లో మొబైల్ కాల్‌తో పరిచయమైంది. అనంతరం ఆ యువతి ఉద్యోగ నిర్వహణలో భాగంగా హైదరాబాద్‌కు రావడంతో వీరిద్దరి మధ్య ప్రేమ ఏర్పడింది. దీంతో ఇరు కుటుంబాలకు చెందిన పెద్దలను ఒప్పించి గత నెలలో గుండ్రాంపల్లి గ్రామంలో పెళ్లి చేసుకున్నారు.

ఎంజీయూ ఇండస్ట్రీ ఇనిస్టిట్యూషన్ డైరెక్టర్‌గా సురేష్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఇండస్ట్రీ ఇనిస్టిట్యూషన్ సెంటర్ డైరెక్టర్‌గా జక్కా సురేష్‌రెడ్డిని నియమిస్తూ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం వీసీ అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి చేతుల మీదుగా సురేష్‌రెడ్డి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. పరిశ్రమలు, యూనివర్సిటీని అనుసంధానం చేస్తూ ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు కృషి చేయాలని కోరారు. పోటీ ప్రపంచంలో కంపెనీల అవసరాలకు తగిన నైపుణ్యాలను పెంపొందించాలంటే పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.


సురేష్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న వీసీ అల్తాఫ్ హుస్సేన్

ఆమెపై ఆగని వేధింపులు!

- ఎన్ని చట్టాలు వచ్చినా కనిపించని మార్పు
- వాట్సాప్ గ్రూపుల్లో అసభ్యకర పోస్టింగ్‌లు
- ప్రేమ పేరుతో యువతులపై దాడులు
- సోషల్ మీడియా ప్రభావంతో యువత పక్కదారి
- నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం


డ్రగ్స్ కిట్

నల్లగొండ : ప్రభుత్వం పోక్సో, నిర్భయ లాంటి కొత్త చట్టాలను తీసుకొచ్చినా యువతులు, మహిళలు, విద్యార్థినులపై ప్రేమ పేరుతో జరిగే వేధింపులు ఆగడం లేదు. పాఠశాలలు, కళాశాలలు మొదలుకొని మహిళలు పనిచేసే చోట్లలోనూ వేధింపులకు గురవుతూనే ఉన్నారు. కొందరు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తుండగా మరికొందరు పరువు పోతుందని, ఇంకొందరు భయంతో మౌనంగా ఉంటున్నారు. పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మహిళలపై వేధింపులు, దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం హుజూర్‌నగర్‌లో ఓ ప్రేమోన్మాది తనను ప్రేమించాలంటూ ఓ యువతిపై పెట్రోల్ పోయడంతోపాటు తనపై పెట్రోలు పోసుకుని హల్‌చల్ సృష్టించారు. దీంతో అటుగా వెళుతున్న వారికి విషయం చెప్పడంతో వారు సదరు యువకుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఇలాంటి ఘటనలో జిల్లాలో జరుగుతూనే ఉన్నాయి.

సోషల్ మీడియా ప్రభావం

స్మార్ట్ ఫోన్లు అందుబాటులోకి వచ్చాక చాలా మంది పిల్లలు రకరకాల వీడియోలు చూస్తూ, అశ్లీల వీడియోలు, అసభ్యకర పోస్టింగ్‌లు పెడుతూ చెడుమార్గాలను అనుసరిస్తున్నారు. మైనర్లు సైతం చెడు వ్యసనాలకు అలవాటు పడి మహిళలను వేధింపులకు పాల్పడుతున్నారు. మద్యం, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడి అమ్మాయిలను ప్రేమించాలంటూ వేధిస్తూ కేసుల పాలవుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కనిపెట్టుకుంటూ ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. వారి ప్రవర్తనలో వస్తున్న మార్పులను గమనిస్తూ తగిన సూచనలు చేయాలని అంటున్నారు. పోలీసులు గంజాయి టెస్టు కిట్ కూడా అందుబాటులోకి తెచ్చి ఎవరైనా డ్రగ్స్ సేవించారని అనుమానం వస్తే అతని యూరిన్ పరీక్ష చేసి తేల్చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 50 డ్రగ్స్ కేసులు నమోదు చేసి పలువురిని జైలుకు పంపారు.

మూడు రకాలుగా వేధింపులు..

సమాజంలో మహిళలు మూడు రకాలుగా వేధింపులకు గురవుతున్నారు. తమను ప్రేమించాలంటూ మహిళలు, యువతుల వెంట పడుతూ వేధించే వారు కొందరైతే.. ప్రేమించుకున్నాక ఫొటోలు, వీడియోలతో బ్లాక్ మెయిల్ చేస్తూ వేధించేవారు మరికొందరు. ఇక, మూడో రకం విషయానికొస్తే అమ్మాయి, అబ్బాయి ఇద్దరు ప్రేమించుకుని బ్రేకప్ అయి మరలా తనను ప్రేమించాలని ఆ అమ్మాయిల వెంట పడి వేధిస్తుంటారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో తరచూ పోలీస్ స్టేషన్ల వరకు వెళ్తున్నాయి. వీటన్నింటిని పోలీసులు విచారించి కొందరికి కౌన్సిలింగ్ ఇవ్వడంతోపాటు పదే పదే తప్పుచేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి జైలుకు సైతం పంపిస్తున్నారు.

2024లో షీటీమ్‌లో నమోదైన కేసుల వివరాలు

పోక్సో	111
వేధింపులపై ఫిర్యాదులు	250
నమోదైన కేసులు	113
అరెస్టయినవారి సంఖ్య	103

వేధింపులకు గురైతే ఫిర్యాదు చేయండి



మహిళలు, విద్యార్థినులు ఎక్కడ వేధింపులకు గురైనా పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేదు. షీటీమ్ 8712670235 నంబర్‌కు లేదా 100 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. వివరాలు గోప్యంగా ఉంచుతాం. ఆన్‌లైన్‌లో వేధింపులకు పాల్పడే వారిని, డ్రగ్స్ అలవాటు పడిన వారిని స్టేషన్‌కు పిలిపించి అవగాహన కల్పిస్తున్నాం. అమ్మాయిలను ఏడిపిస్తే కొత్త చట్టాల ప్రకారం శిక్షార్హులవుతారు.

– కరుణాకర్, షీటీమ్స్ సీఐ, నల్లగొండ

ఆటో డ్రైవర్‌కు ఎనిమిదేళ్లు జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ): నిర్లక్ష్యంగా ఆటో నడిపి వ్యక్తి మృతికి కారణమైన ఆటో డ్రైవర్‌కు 8 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ జిల్లా మూడో అదనపు జడ్జి డి. దుర్గాప్రసాద్ గురువారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2021 నవంబర్ 14న మర్రిగూడ మండలం వట్టిపల్లికి చెందిన మామిడి యాదమ్మ, ఆమె భర్త లక్ష్మయ్య కలిసి తమ కుమార్తె పెళ్లికి బట్టలు కొనేందుకు అదే గ్రామానికి చెందిన మల్గిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆటో మాట్లాడుకుని మాల్‌కు బయల్దేరారు. అప్పటికే మద్యం సేవించి ఉన్న ఆటో డ్రైవర్ వెంకట్‌రెడ్డి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో ఆటో బోల్తా పడింది. ఆటో కింద లక్ష్మయ్య పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. యాదమ్మ ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ సత్యం, ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆటో డ్రైవర్ వెంకట్‌రెడ్డిని కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. జవహర్‌లాల్ వాదనలతో ఏకీభవించిన జడ్జి డి. దుర్గాప్రసాద్ మద్యం సేవించి లక్ష్మయ్య మృతికి కారణమైన ఆటో డ్రైవర్ వెంకట్‌రెడ్డికి 8 సంవత్సరాల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా లేదా మరో 6 నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. మర్రిగూడ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణ, లైజనింగ్ ఆఫీసర్ నరేందర్, మల్లికార్జున్ విచారణకు సహకరించారు.

పంటలు ఎండుతున్నా మంత్రులకు పట్టదా?

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శ


మాట్లాడుతున్న కల్వకుంట్ల కవిత, పక్కన గొంగిడి సునీత, క్యామ మల్లేష్ తదితరులు

సాక్షి, యాదాద్రి : ఉమ్మడి జిల్లాలో కరెంట్ కోతలతో నీళ్లు అందక పంటపొలాలు ఎండిపోతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం తాగునీరు కూడా ఇవ్వలేకపోతోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. గురువారం జనగామ జిల్లా పర్యటన ముగించుకుని హైదరాబాద్ వెళ్తూ కొద్దిసేపు భువనగిరిలోని వివేరా హోటల్‌లో ఆగారు. అక్కడ విలేకరులతో ఆమె మాట్లాడారు. ఆలేరు, భువనగిరికి కేసీఆర్ హయాంలో కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలు, ఇంటింటికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించారని గుర్తుచేశారు. విద్యుత్ సమస్య ఉండొద్దని కేసీఆర్ ప్రభుత్వంలో జిల్లాలో పవర్‌ప్లాంటు ఏర్పాటు చేశారని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కమీషన్లపై దృష్టి కేంద్రీకరించారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఉన్న అధిక సంతానం నిబంధన ఎత్తివేయాలన్నారు. చాలా రాష్ట్రాల్లో ముగ్గురు పిల్లల నిబంధన తొలగించారని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో ముందుకు పోవాలన్నారు. విద్య, ఉపాధి రాజకీయ రంగాల్లో వేర్వేరుగా మూడు బిల్లులు ప్రవేశపెట్టి వాటికి చట్టబద్ధత కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. రిజర్వేషన్లపై న్యాయస్థానాలకు వెళ్ళినప్పుడు కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్మాణాత్మకంగా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. లేదంటే కాంగ్రెస్ పార్టీ బీసీల ద్రోహి పార్టీగా మిగిలిపోతుందన్నారు. సోషల్ మీడియాలో చిన్న పోస్ట్ పెట్టినా.. సీఎం రేవంత్ వణికిపోతున్నారన్నారు. కవిత వెంట మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, నాయకులు క్యామ మల్లేష్, బీరు మల్లయ్య, అనురాధ, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

ఆపరేషన్లు చేయిస్తూ.. ఆరోగ్యం తెలుసుకుంటూ

- మునుగోడు నియోజకవర్గ ప్రజలకు అండగా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి


ఆపరేషన్ చేయించుకున్న వృద్ధురాలి ఆరోగ్యం గురించి తెలుసుకుంటున్న రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: మునుగోడు నియోజకవర్గ ప్రజలకు స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కంటి ఆపరేషన్లు చేయిస్తూ అందరి మన్నలు పొందుతున్నారు. తన తల్లి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనవరిలో ఒకసారి, ఈ నెల 9వ తేదీన మరోసారి మునుగోడులోని తన క్యాంపు కార్యాలయంలో మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 1350 మంది కంటి పరీక్షలు చేయించుకోగా అందులో 650 మందికి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు సూచించారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఎమ్మెల్యే ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసి హైదరాబాద్‌లోని శంకర్ ఆస్పత్రికి తీసుకెళ్లి ఇప్పటి వరకు 520 మందికి దగ్గర ఉండి కంటి ఆపరేషన్లు చేయించారు. ఆపరేషన్లు చేయించుకున్న వారి వద్దకు ఎమ్మెల్యే వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్నారు. అనంతరం ప్రత్యేక బస్సుల్లోనే గ్రామాలకు తీసుకెళ్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో నెలలో రెండుసార్లు కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.


చేనేత సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తా

- సహకార్ భారతి ఆలిండియా చేనేత విభాగం అధ్యక్షుడు అనంతకుమార్ మిశ్రా


మాట్లాడుతున్న అనంతకుమార్ మిశ్రా

భూదాన్‌పోచంపల్లి: చేనేత సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని సహకార్ భారతి ఆలిండియా చేనేత విభాగం అధ్యక్షుడు అనంతకుమార్ మిశ్రా పేర్కొన్నారు. గురువారం భూదాన్‌పోచంపల్లిలో రాష్ట్ర చేనేత సహకార్ భారతి ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చేనేత పని ఒక్కరితో పూర్తికాదని, సమష్టి కృషితోనే అందమైన చీర తయారవుతుందని చెప్పారు. ఎంతో నైపుణ్యం కల్గిన చేనేత కార్మికులకు తగిన గుర్తింపు దక్కడం లేదని, సంక్షేమ పథకాలు అందడం లేదని వాపోయారు. వీరి సురక్షిత జీవనానికి ప్రభుత్వాలు వెంటనే పూనుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే సహకార్ భారతి కార్మికులకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సంఘటిత ఉద్యమాల ద్వారానే హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సహకార్ భారతి రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, బీజేపీ చేనేతసెల్ జిల్లా కన్వీనర్ గంజి బస్వలింగం, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, పట్టణ అధ్యక్షుడు డబ్బీకార్ సాహెచ్, చేనేతకార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చింతకింది రమేష్, మాజీ సర్పంచ్ నోముల గణేశ్, చేనేతనాయకులు ఏలే భిక్షపతి, రుద్ర శ్రీశైలం, రుద్ర చెన్నకేశవులు, కడవేరు శేఖర్, ఏలే శ్రీనివాస్, గొలనుకొండ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


బిట్ల పవన్ (ఫైల్)

రాజాపేట: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాజాపేట మండలం రఘునాథపురం గ్రామంలో గురువారం జరిగింది. ఎస్ఐ సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రఘునాథపురం గ్రామానికి బిట్ల రమేష్‌కు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. రమేష్ కుటుంబ సభ్యులంతా కలిసి స్థానికంగా అద్దె ఇంట్లో ఉంటూ హోటల్ నిర్వహిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న రమేష్ పెద్ద కుమారుడు బిట్ల పవన్ (25) గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయికుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పవన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీలకు ప్రాజెక్టుల ఎంపిక

రామగిరి(నల్లగొండ): డిగ్రీ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు ప్రతి ఏటా రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీలను నిర్వహిస్తున్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు కొన్ని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి.

- నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల నుంచి హిస్టరీ సబ్జెక్టులో హిస్టారికల్ ప్లేసెస్ ఇన్ నల్లగొండ టౌన్, ఫిజిక్స్ సబ్జెక్టులో అగ్రికల్చర వీడర్
- నల్లగొండ జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాల నుంచి బోటనీ సబ్జెక్టు నుంచి ఏ కంపారిటీవ్ స్టడీ ఆన్ ది ఇంపాక్ట్ ఆఫ్ ఆర్గానిక్ అండ్ కెమికల్ ఫెర్టిలైజర్స్ ఆన్ ది న్యూట్రిషినల్ కంపోజిషన్ ఆఫ్ సెలక్టెడ్ వెజిటేబుల్స్, కామర్స్ సబ్జెక్టులో ఎక్స్‌ప్లోరింగ్ టూరిజమ్ పోటెన్షియల్ ఇన్ నల్లగొండ డిస్ట్రిక్ట్ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఏ కంప్రహెన్సివ్ స్టడీ ప్రాజెక్టులు ఎంపికయ్యాయి.
- మిర్యాలగూడలోని కేఎన్ఎం డిగ్రీ కళాశాల నుంచి మాథ్స్ సబ్జెక్టులో ది రోల్ ఆఫ్ మేథమెటిక్స్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్,
- దేవరకొండలోని ఎంకేఆర్ కళాశాల నుంచి మాథ్స్ సబ్జెకులో ఎసెన్షియల్ మాథమెటిక్స్ ఫర్ ఇన్వేస్టింగ్ ఇన్ ద స్టాక్ మార్కెట్, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులో ఏ కేస్ స్టడీ ఆన్ ఎలక్ట్రోరల్ రీఫామ్స్ ఇన్ తెలంగాణ నీడ్స్, ఇష్యూస్ అండ్ ఛాలెంజెస్ ప్రాజెక్టులు ఎంపికయ్యాయి.
- సూర్యాపేట జిల్లా కోదాడలోని కేఆర్ఆర్ కళాశాల నుంచి ఎకనామిక్స్ సబ్జెక్టులో ఇంపాక్ట్ ఆఫ్ లేబర్ మైగ్రేషన్ ఆన్ అగ్రికల్చర్ డ్యూ టు కోవిడ్ 19 ఏ కేస్ స్టడీ ఇన్ సూర్యాపేట డిస్ట్రిక్ట్ ఆఫ్ తెలంగాణ, ఫిజిక్స్ సబ్జెక్టులో రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ రీసోర్సెస్.
- హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి తెలుగు సబ్జెక్టులో రూపొందించిన ప్రాజెక్టులు ఎంపికయ్యాయి.
- యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఫిజిక్స్ సబ్జెక్టులో యూజెస్ ఆఫ్ డ్రోన్ టెక్నాలజీ ఏ స్పెషియల్ రెఫరెన్స్ టు అగ్రికల్చర్, తెలుగు సబ్జెక్టులో డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య జీవితం సాహిత్యంపై రూపొందించిన ప్రాజెక్టులు ఎంపికయ్యాయి.

త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించనున్నారు.

ముగిసిన పూర్వగిరీశుడి బ్రహ్మోత్సవాలు

- చివరిరోజు ఘనంగా శతఘటాభిషేకం


మంత్రపూరిత జలాన్ని గర్భగుడిలోకి తీసుకెళ్తున్న ఆలయ అర్చకులు

యాదగిరిగుట్ట రూరల్: పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి (పాతగుట్ట) ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. చివరి రోజు శతఘటాభిషేకంతో ఉత్సవాలకు ముగింపు పలికారు. స్వామివారికి ఆలయ ముఖ మండపంలో 108 కలశాలను వరుస క్రమంలో ఉంచి ప్రత్యేక పూజలు చేసి, అష్టోత్తర శతఘటాభిషేక వేడుకను నిర్వహించారు. అనంతరం ఆ జలంతో స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేశారు. ఈ పూజల్లో ఆలయ చైర్మన్ నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, ఏఈఓలు జూషెట్టి కృష్ణగౌడ్, గజవెల్లి రమేష్, బాబు, రఘు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి అర్జిత సేవలు పునరుద్ధరణ

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 3వ తేదీ నుంచి రద్దైన అర్జిత సేవలు, నిత్య, శాశ్వత కల్యాణాలు, సుదర్శన నారసింహ హోమాలు వంటి పూజలు శుక్రవారం నుంచి యధావిధిగా కొనసాగుతాయని ఆలయ అధికారులు వెల్లడించారు.

అప్పు తీర్చేందుకు వృద్ధురాలి హత్య

- నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్ చంద్ర

భువనగిరి: వృద్ధురాలిని హత్య చేసి పుస్తెలతాడు దొంగిలించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం డీసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులకు వెల్లడించారు. ఆలేరు పట్టణంలోని రంగనాయక వీధిలో నివాసముంటున్న తునికి మణెమ్మ(80)కు జనగామ జిల్లాకు చెందిన పుల్లెంగుల శంకర్ బంధువు అవుతాడు. శంకర్ అప్పుడప్పుడు మణెమ్మ ఇంటికి వచ్చేవాడు. అప్పులపాలైన శంకర్ వాటిని తీర్చేందుకు ఒంటరిగా ఉంటున్న మణెమ్మ మెడలో ఉన్న పుస్తెలతాడును దొంగిలించాలని నిర్ణయించుకున్నాడు. బుధవారం జనగామ నుంచి ఆలేరు పట్టణానికి వచ్చి మధ్యాహ్నం మణెమ్మ ఇంటికి వెళ్లి గొంతు నులిమి చంపేసి ఆమె మెడలోని పుస్తెలతాడు తీసుకుని పరారయ్యాడు. మృతురాలి కుమారుడు రామారావు ఫిర్యాదు మేరకు ఆలేరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. గురువారం ఆలేరు పట్టణంలో యాదగిరిగుట్ట సీఐ కొండల్‌రావు వాహనాలను తనిఖీ చేస్తుండగా.. కారులో అటుగా వస్తున్న శంకర్ పారిపోయే ప్రయత్నం చేశాడు. పోలీసులు అతడిని పట్టుకుని విచారించగా.. మణెమ్మను తానే హత్య చేసి పుస్తెలతాడు ఎత్తుకెళ్లినట్లు ఒప్పుకున్నాడు. రెండున్నర తులాల పుస్తెలతాడు, కారు, సెల్‌ఫోన్, రూ.5,720 నగదు స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. సీఐతో పాటు ఎస్ఐ రజనీకర్, సిబ్బంది సత్యనారాయణ, చంద్రశేఖర్, మహేష్ డీసీపీ అభినందించారు.